



EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
24-09-2025
పేజీలు: 02



# ఐరాస ఏం చేస్తోంది?

భారత- పాకిస్తాన్ తో సహా ప్రపంచవ్యాప్తంగా ఏడు యుద్ధాల ను తానే ఆపగలిగానని అమెరికా ప్రెసిడెంట్ డోనాల్ ట్రంప్ పునరుద్ఘాటించా రు. ఐక్యరాజ్యసమితి వేదికగా 80వ జ నరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రపంచనాయకులనుద్దేశించి ఆయన మంగళవారం నాడు ప్రసంగించారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పదవీ బాధ్యత లు చేపట్టిన తర్వాత ఐక్యరాజ్యసమితి పోడియం నుంచి తొలిసారి ట్రంప్ ప్ర సంగించారు. ఆయా దేశాల మధ్య జ రుగుతున్న యుద్ధాలను ఆపడంలో ఐరా స ఘోరంగా విఫలమైందని తీవ్ర ఆరో పణలు చేశారు. ఐరాస చేయాల్సిన పను లను నేను చేస్తున్నానని వ్యాఖ్యానిం చా రు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఏడు నె లల కాలలో ఏడు యుద్ధాల కు తానే స్వస్తి పలికానని ఆయన తెలిపారు. వీ టిలో దాదాపు 36 ఏళ్లుగా సాగుతున్న యుద్ధం, రెండు 31 ఏళ్ల పాటు కొనసాగిన యుద్ధాలు , 28 ఏళ్లుగా ము గింపు అన్నదే లేకుండా సాగిన మరో సమరం ఉన్నాయని ప్రెసిడెంట్ అన్నా రు. ఎన్నో ఏళ్లపాటు ముగింపు అన్నదే లేకుండా ఉధృతంగా సాగిన యుద్ధా లు. కంబోడియా- థాయిలాండ్, కొసావో -సెర్బియా, కాంగో -రువాండాతో పాటు, భారత-పాకిస్తాన్, ఇజ్రాయెల్ -ఇరాన్, ఈజిప్ట్ — ఇథియోపియా, అర్మేనియా అజర్ బైజాన్ వంటి హింసాత్మక యుద్ధాలు తన ప్రమేయంతోనే ఆగిపోయాయని డోనాల్ట్ ట్రంప్ పేర్కొన్నారు.



# మంచిర్యాలలో చెడ్డి గ్యాంగ్ హల్‌చల్

మంచిర్యాలలో చెడ్డి గ్యాంగ్ హల్చల్ చేసిన ఘటన బుధవారం తెల్లవారుజామున కలకలం రేపింది. తెలిసిన వివరాల ప్రకారం నాస్పూర్ కలెక్టరేట్ ఏరియాలో ఉన్న ఓ ఇంట్లో చెడ్డీ గ్యాంగ్ చోరీకి పాల్పడినట్లు తెలిసింది. అలాగే పట్టణంలోని గోదావరి వాడలో మరో ఇంట్లో చొరబడి అక్కడ సెల్‌ఫోన్, రూ.5వేలను ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. అదే ఏరియాలో మరో ఇంట్లో దొంగతనానికి పాల్పడటానికి ప్రయత్నిస్తున్న సమయంలో అక్కడికి పోలీస్ పెట్రోలింగ్ వాహనం వచ్చింది. పోలీసుల వాహనాన్ని చూసి అప్రమత్తమైన దొంగలు.. అక్కడ్నుంచి పారిపోయారు. ఈ దృశ్యాలు అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యారు. దొంగలను పోలీసులు వెంబడించారు. అయినా కంటికి కనిపించకుండా దొంగలు నిష్క్రమించినట్లు తెలుస్తోంది. ఈ చెడ్డి గ్యాంగ్ చోరీకి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. చెడ్డి గ్యాంగ్ చోరీలతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తమ కాలనీల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

# నేడు బంగ్లాదేశ్‌తో భారత్ పోరు




ఆసియాకప్ సూపర్4లో భాగంగా బుధవారం జరిగే కీలక మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచే జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. శ్రీలంకపై బంగ్లా, పాకిస్థాన్‌పై భారత జట్లు విజయం సాధించి జోరుమీదున్నాయి. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లాలనే పట్టుదలతో రెండు జట్లు ఉన్నాయి. బంగ్లాతో పోల్చితే టీమిండియా చాలా బలంగా కనిపిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు సమతూకంగా ఉంది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌లు ఫామ్‌లో ఉండడం టీమిండియాకు కలిసి వచ్చే అంశంగా చెప్పాలి. ఈ మ్యాచ్‌లో కూడా ఓపెనర్లపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. అభిషేక్ మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగిపోతున్నాడు. పాకిస్థాన్‌పై విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. బంగ్లాపై కూడా అదే జోరును కొనసాగించాలని భావిస్తున్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన అభిషేక్ తన మార్క్ బ్యాటింగ్‌తో చెలరేగితే బంగ్లా బౌలర్లకు కష్టాలు ఖాయం. గిల్ కూడా నిలకడైన బ్యాటింగ్‌ను కనబరుస్తున్నాడు. ఈసారి కూడా ఓపెనర్లు జట్టుకు శుభారంభం అందించాలనే పట్టుదలతో ఉన్నారు. అయితే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కిందటి మ్యాచ్‌లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. అతని ఫామ్ జట్టును కలవరానికి గురిచేస్తోంది. మరో సీనియర్ బ్యాటర్ సంజు శాంసన్ కూడా పాకిస్థాన్‌పై విఫలమయ్యాడు. కీలకమైన ఈ మ్యాచ్‌లోనైనా సంజు తన బ్యాట్‌కు పని చెప్పాల్సిన అవసరం ఉంది. ఇక తెలుగు కుర్రాడు తిలక్ వర్మ కిందటి మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడడం టీమిండియాకు శుభసూచకంగా చెప్పాలి. ఈసారి కూడా అతని నుంచి ఇలాంటి ఇన్నింగ్స్‌నే జట్టు ఆశిస్తోంది. హార్విక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్ రూపంలో మ్యాచ్ విన్నర్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉన్నారు. ఇది టీమిండియాకు అతి పెద్ద ఊరటగా చెప్పాలి. బౌలింగ్‌లోనూ భారత్ బలంగా ఉంది. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తదితరులు నిలకడగా బౌలింగ్ చేస్తున్నారు. ఈ మ్యాచ్‌లో కూడా జట్టు వీరిపై భారీ ఆశలు పెట్టుకుంది. మరోవైపు బంగ్లాదేశ్‌ను తక్కువ అంచనా వేసే పరిస్థితి లేదు. ఫార్మాట్ ఏదైనా సర్వం ఒడ్డి పోరాడడం బంగ్లా ఆటగాళ్లకు వెన్నతో పెట్టిన విద్య. లంకపై గెలవడంతో జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. ఇదే జోరును టీమిండియాపై కూడా కనబరచాలనే పట్టుదలతో జట్టు ఆటగాళ్లు ఉన్నారు. సైఫ్ హసన్, కెప్టెన్ లిటన్ దాస్, తౌహిద్ హృదయ్, జాకేర్ అలీ, మెహదీ హసన్ తదితరులతో బంగ్లా బ్యాటింగ్ బలంగా ఉంది. అంతేగాక ముస్తఫిజుర్ రహ్మాన్, మెహదీ హసన్, షరిఫుల్ ఇస్లామ్, తస్కిన్ అహ్మద్ వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు ఉండనే ఉన్నారు. రెండు జట్లలోనూ స్టార్ ఆటగాళ్లు ఉండడంతో మ్యాచ్ ఆసక్తికరంగా సాగడం ఖాయం.

# హాట్ త్రిప్తి

సందీప్ రెడ్డి వంగా స్పిరిట్‌లో హీరోయిన్‌గా ఛాన్స్ దక్కించుకున్నారు త్రిప్తి దిమ్రి. అదృష్టం అంటే ఇదేనంటూ, గతంలో ఆమె ఈ ప్రాజెక్టు గురించి చెప్పిన విషయాలను గుర్తుచేసుకుంటున్నారు నెటిజన్లు. యానిమల్ ప్రమోషన్లలో ఉన్న త్రిప్తికి... సందీప్‌రెడ్డి వంగా నెక్స్ట్ ప్రాజెక్ట్ స్పిరిట్‌లో మీరున్నారట కదా అనే క్వశ్చన్ ఎదురైంది. అంత పెద్ద ప్రాజెక్టులో ఉండాలనుకోవడం అత్యాశే అవుతుంది. అయినా బ్యాక్ టు బ్యాక్ నాకు సందీప్ అవకాశాలు ఎందుకిస్తారు? అసలుఉ ఇస్తారా? అని ఎదురుప్రశ్నించారు త్రిప్తి. ఇప్పుడు ఈ విషయాన్నే రీకాల్ చేసుకుంటున్నారు నెటిజన్లు. ఆమె ఊహల్లో కూడా లేని విషయం నిజమైంది. కలిసొచ్చే కాలం అంటే ఇదేనంటూ మాట్లాడుకుంటున్నారు. అంతే కాదు, త్రిప్తికి నచ్చిన హీరోయిన్ గురించి కూడా డిస్కషన్ మొదలుపెట్టేశారు. తనకు దీపిక పదుకోన్ అంటే చాలా ఇష్టమని ఇంతకు ముందు చెప్పారు త్రిప్తి. దీపిక సినిమాలు చూసి, ఆమెలా హెయిర్ కట్ చేయించుకునేదాన్నని అన్నారు. ఆ మాటలన్నీ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



# పెంపుడు కుక్కకు కోపమొచ్చి గోరుతో గిచ్చింది.. కట్ చేస్తే.. తెల్లారేసరికి



ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న పెంపుడు కుక్కే తమ ఇంట్లో విషాదాన్ని నింపుతుందని ఆ కుటుంబ సభ్యులు ఊహించలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం గ్రామంలో విషాదం నెలకొంది. రేబిస్ వ్యాధి సోకి సందీప్( 25) అనే యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రెండు నెలల క్రితం సందీప్ అనే యువకుడు వీధిలో అందంగా కనిపించిన ఓ కుక్కపిల్లని పెంచుకునేందుకు ఇంటికి తీసుకువెళ్లాడు. ఈ క్రమంలోనే ఆ కుక్క పిల్ల తన తండ్రిని కరవడంతో పాటు తనను కూడా గోర్లతో రక్కింది. దీంతో తన తండ్రికి స్థానిక పిహెచ్సిలో చికిత్స చేయించుకుని.. తనను మాత్రం కరవలేదు కదా అని అజాగ్రత్త వ్యవహరించడంతో.. చికిత్స తీసుకోలేదు సందీప్. వారం రోజుల క్రితం రేబిస్ లక్షణాలు కనిపించి సందీప్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతనిని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. రేబిస్ వ్యాధి సోకిందని డాక్టర్లు తెలపడంతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. గత వారం రోజులుగా చికిత్స పొందుతూ సందీప్ మృతి చెందాడు. కుక్క రక్కడమే కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరించడమే యువకుడి ప్రాణాలు తీసిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# పారాసిటమాల్ సురక్షితమైంది : డబ్ల్యూహెచ్‌వో

పెయిన్ కిల్లర్ టైలినాల్(ఇండియాలో పారాసిటమాల్)ను గర్భిణీ స్త్రీలు వాడకూడదని ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ డ్రగ్ వాడకం వల్ల ఆటిజం పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)కొట్టిపారేసింది. ప్రెగ్నెన్సీ సమయంలో పారాసిటమాల్ ట్యాబ్లెట్లను వాడడం వల్ల ఆటిజం పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నాయన్న వాదనకు ఆధారాలు లేవని డబ్ల్యూహెచ్‌వో పేర్కొన్నది. జెనీవాలో డబ్ల్యూహెచ్‌వో ప్రతినిది తారిక్ జాసరవిక్ మాట్లాడుతూ.. టైలినాల్, ఆటిజం మధ్య ఉన్న లింకు అంశంలో ఆధారాలు సరిగా లేవన్నారు. వ్యాక్సిన్ల వల్ల ఆటిజం రాదన్న విషయం తెలుసు అని, టీకాలు కోట్లాది మంది ప్రాణాలను కాపాడుతున్నాయని, ఇది శాస్త్రీయంగా నిర్ధారణ జరిగిందని, దీన్ని ప్రశ్నించలేమని డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి తారిక్ తెలిపారు. డబ్ల్యూహెచ్‌వో చెప్పిన విషయాన్నే యురోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ కూడా సమర్థించింది. ఈయు దేశాల్లో పారాసిటమాల్‌ను అసిటమినోఫిన్‌గా వాడుతుంటారు. ప్రగ్నెన్సీ మహిళల్లో నొప్పులు, జ్వరం వస్తే ఆ మందునే వినియోగిస్తారు. అయితే




ప్రస్తుతం ఆ మాత్రలను మార్చే కొత్త ప్రతిపాదనలు ఏమీ లేవని యురోపియన్ మెడికల్ ఏజెన్సీ పేర్కొన్నది. జ్వరంతో ఉన్న ప్రెగ్నెంట్ మహిళలకు పారాసిటమాల్‌నే వాడుతామని ఈఎంఏ చీఫ్ మెడికల్ ఆఫీసర్ స్టీఫెన్ తిర్‌స్ట్రుప్ తెలిపారు. ప్రెగ్నెన్సీలో పారాసిటమాల్ వాడితే దాని వల్ల పిల్లల్లో ఆటిజం వస్తుందన్న ఆధారాలు తమ వద్ద లేవన్నారు.

# షేక్ పేట్ లో పర్యటించిన మంత్రులు పొన్నం, వివేక్

హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో షేక్ పేట్ డివిజన్ ఓయూ కాలనీ లో సహచర మంత్రి వివేక్ వెంకట్ స్వామితో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. షేక్ పేట్ డివిజన్ లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ మంత్రులకు వివరించారు. వర్షాల కారణంగా ప్రస్తుతం చేస్తున్న పనులు, చేయాల్సిన పనులు గురించి మంత్రులకు తెలియజేశారు. డివిజన్ లో నాలాల సమస్యలు, సిసి రోడ్ల నిర్మాణం అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే శంకుస్థాపన చేసుకున్న పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. షేక్ పేట డివిజన్ లో ఎక్కడ ఏ సమస్య ఉన్నా స్థానిక నేతల ద్వారా తమ దృష్టికీ తీసుకురావాలనీ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేసి వారంలో ప్రారంభోత్సవాలు చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

# హెచ్ 1 బీ వీసా దరఖాస్తు ఎంపికలో డీహెచ్‌ఎస్ కొత్త నిబంధనలు

అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా ఎంపిక లాటరీ ప్రక్రియలో కీలక మార్పులు తీసుకురావడానికి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదివరకే హెచ్-1బీ వీసా రుసుములను భారీగా పెంచిన ట్రంప్ ప్రభుత్వం, వీసా ఎంపికలోనూ మార్పులు చేయనున్నట్లు సమాచారం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించిన కొత్త నిబంధనల ప్రకారం, వీసా దరఖాస్తుల ఎంపికలో ప్రస్తుత లాటరీ విధానానికి స్వస్తి పలికి, అధిక నైపుణ్యం కలిగి, ఎక్కువ వేతనం పొందే విదేశీ నిపుణులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.తాజా ప్రతిపాదనల ప్రకారంఉద్యోగుల వేతన స్థాయిని ఆధారంగా దరఖాస్తులను వర్గీకరించడం, వేతన వర్గీకరణ అలాగే అమెరికన్ ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ మార్పులు 2026 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయాలని డీహెచ్ఎస్ భావిస్తోంది.డీహెచ్ఎస్ అంచనాల మేరకు ఈ మార్పుల వల్ల హెచ్-1బీ వీసాదారులకు చెల్లించే వేతనాల మొత్తం 2026 ఆర్థిక సంవత్సరంలో 502 మిలియన్ డాలర్ల నుంచి 2029లో 2 బిలియన్ డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉంది.ఈ నిర్ణయాలు వీసా విధానాలను మరింత కఠినతరం చేస్తాయని, స్థానిక ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ తాజా ప్రతిపాదనలపై వివిధ వాణిజ్య, వీసా రంగాల నిపుణులు స్పందిస్తున్నారు.

**హెచ్-1బీ వీసా 'లాటరీ' విధానంలో మార్పులు!**

అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ కొత్త నిబంధనలు రూపొందిస్తోంది. తాజా ప్రతిపాదనల ప్రకారం, లాటరీ




విధానంలో మార్పు చేసి.. అధిక నైపుణ్యం, ఎక్కువ వేతనమున్న నిపుణులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగుల వేతన స్థాయిని ఆధారంగా రిజిస్ట్రేషన్లను వర్గీకరించటం, అమెరికన్లకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలు తీసుకోనున్నారని సమాచారం. 2026—2029 వరకు వీసా వేతనాల మొత్తం 502 మిలియన్ డాలర్ల నుంచి 2 బిలియన్ డాలర్ల వరకు పెరుగుతుందని DHS అంచనా వేస్తుంది.

## గ్రూప్-1పై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే




గ్రూప్-1 మెయి న్స్ పరీక్ష పేపర్లను తిరిగి మూల్యాంక నం చేయాలని లేనిపక్షంలో తిరిగి పరీక్షలను నిర్వహించాలంటూ సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లపై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. విచారణను వచ్చే నెల 15వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు డివిజన్ బెంచ్. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో 719 మంది అభ్యర్థులు ఒకే రకమైన మారులు సాధించడం, అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసంపై టీజీపీఎస్సీ ఇచ్చిన వివరణను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో 14.8% మంది టాప్-500 మందిలో ఉన్నారనేందుకు ఆధారాలు లేవని పిటిషన్‌లో పేర్కొన్నారు. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన పరమేశ్ మట్టా, మరో 221 మంది అభ్యర్థులను ప్రతివాదులుగా చేర్చిన ఈ పిటిషన్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది.

## మాస్కులు ధరించి ప్రియురాలి భర్తపై హత్యాయత్నం

ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తన స్నేహితుడితో కలిసి ఆమె భర్తపై హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ సంఘటన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం___ మెదక్ జిల్లాకు చెందిన దేశబోయిన భూపాల్‌తో కామారెడ్డికి చెందిన చంద్రకళకు(23) ఐదు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. దంపతులు కూకట్‌పల్లిలోని సుమిత్రానగర్‌లో నివాసం ఉంటున్నారు. చంద్రకళ తన గ్రామానికి చెందిన దుర్గయ్య(26)తో అక్రమ సంబంధం పెట్టుకుంది. దీంతో అతడిని తన వెనక వీధిలో అద్దె ఇంట్లో ఉంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం భూపాల్‌కు తెలియడంతో పలుమార్లు భార్యను మందలించాడు. కానీ ఆమెలో మార్పు రాకపోవడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. చంద్రకళ ఇండ్లలో పని చేయడానికి వెళ్లనప్పుడు భూపాల్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. దుర్గయ్య తన స్నేహితులతో కలిసి ముఖానికి మాస్క్ వేసుకొని భూపాల్ ఇంటికి చేరుకొని అతడిని కిందపడేసి చంపుతుండగా కేకలు వేశాడు. స్థానికులు స్పందించడంతో నిందితులు పారిపోయారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని భూపాల్ నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. తన భార్య ప్రియుడే తనపై హత్యాయత్నం చేశాడని ఫిర్యాదులో భర్త పేర్కొన్నారు. భార్య, ప్రియుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తానే హత్య చేశానని ఒప్పుకున్నాడు. వెంటనే ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## రాజేంద్రనగర్ లో నడిరోడ్డుపై గొంతుకోసి హత్య?

రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. వ్యవసాయ వర్సిటీ సమీపంలో బెంగుళూరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని మృతదేహం రక్తం మడుగులో పడి ఉంది. అతి కిరాతకంగా కత్తితో గొంతుకోసి హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేసినట్లుగా పోలీసుల అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీ సాయంతో ఆధారాల సేకరిస్తున్నారు. వరుస హత్యాలతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. గత వారం మహిళను అత్యాచారం చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. మంగళవారం మైలార్ దేవుపల్లిలో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు సుపారీ తీసుకున్న విషయం విధితమే.

## చంద్రబాబుకు సిఐ శంకరయ్య లీగల్ నోటీసులు

ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిఐ శంకరయ్య లీగల్ నోటీసులు పంపించారు. రూ. 1.45 కోట్లు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వివేకా హత్య కేసులో తన ప్రతిష్టకు బాబు భంగం కలిగించారని ఆరోపణలు చేశారు. అసెంబ్లీలో సిఎం చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో వివరించారు. తన వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతినేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేశారని శంకరయ్య ఆరోపణలు చేశారు. వివేకా హత్య జరిగినప్పుడు 2019లో పులివెందుల సిఐగా శంకరయ్య ఉన్నారు. ప్రస్తుతం కర్నూలు రేంజ్‌లో శంకరయ్య వీఆర్‌లో ఉన్నారు. సిఐ శంకరయ్య సమక్షంలోనే నిందితులు హత్యకు సంబంధించిన ఆధారాలు ధ్వంసం చేశారని గతంలో చంద్రబాబు దురుద్దేశపూర్వకంగా ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

## కాళేశ్వరం నివేదిక.. హైకోర్టుకు వెళ్లిన స్మితా సబర్వాల్!



కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సభర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ వేశారు. నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరినట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషి హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఇటీవల ఊరట లభించిన విషయం తెలిసిందే. కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సభర్వాల్ సైతం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే ప్రస్తుతం ఆమె పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. పరిశీలన పూర్తయి లిస్ట్ అయిన తర్వాత విచారణకు వచ్చే అవకాశం ఉంది.




## జగన్ ప్రతిపక్ష హోదా పిటిషన్.. స్పీకర్‌కు నోటీసులు

తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ వేసిన పిటిషన్‌పై ఇవాళ(బుధవారం) హైకోర్ట్‌లో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ప్రతివాదులుగా ఉన్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. గతంలో జగన్ వేసిన పిటీషన్‌ను కూడా ఈ పిటిషన్‌కు కలపాలని ఆదేశించింది. గతంలో జగన్ రాసిన లేఖపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూలింగ్ ఇచ్చారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదాను తామెలా ఇస్తామని ప్రశ్నించారు. రాజ్యాంగం, అసెంబ్లీ నిబంధనలు అంగీకరించవని ఆయన స్పష్టం చేశారు. స్పీకర్ రూలింగ్‌పై హైకోర్ట్‌ను జగన్ ఆశ్రయించారు. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించాలని పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన హైకోర్టు విచారణను అక్టోబర్ 4కు వాయిదా వేసింది.

## ఢిల్లీ స్వామీజీపై లైంగిక వేధింపుల కేసు.. ఫిర్యాదు చేసిన 17 మంది అమ్మాయిలు



ఢిల్లీలోని విలాసవంతమైన వసంత్ కుంజ్ ప్రాంతంలో ఉన్న ఓ ఆశ్రమంలోని స్వామీజీపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దాదాపు డజన్ మంది కన్నా ఎక్కువ మంది మహిళలు ఆ స్వామీజీపై ఫిర్యాదు చేసినట్లు పోలీసులు చెప్పారు. శ్రీ శారద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్మెంట్‌లో పనిచేస్తున్న స్వామి చైతన్యానంద సరస్వతి అలియాస్ పార్థసారథి అనే స్వామీజీపై కేసు నమోదు చేశారు. బలహీనవర్గాల కేటగిరీలో పీజీ మేనేజ్మెంట్ డిప్లొమా కోర్సులు చదువుతున్న విద్యార్థినులు ఆ ఫిర్యాదు చేశారు. ఆ ఆశ్రమంలోని 32 మంది విద్యార్థినులను పోలీసులు విచారించారు. దీంట్లో సుమారు 17 మంది అమ్మాయిలు స్వామీ చైతన్యానందపై ఆరోపణలు చేశారు. ద్వేషపూరిత భాషను వాడుతున్నారని, శృంగారభరిత టెక్ట్స్ మెసేజ్‌లు చేస్తున్నారని, భౌతికంగా తాకేందుకు ప్రయత్నిస్తున్నారని మహిళలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. డైరెక్టర్‌కు లొంగిపోవాలని ఆ ఆశ్రమంలోని మహిళా సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది కూడా వత్తిడి చేస్తున్నట్లు విద్యార్థినులు ఆరోపించారు. ఆశ్రమంలో పనిచేస్తున్న వార్డెన్లు.. నిందితుడికి తమను పరిచయం చేసినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. స్టూడెంట్స్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా స్వామీ చైతన్యానందపై లైంగిక వేధింపుల కేసు బుక్ చేసినట్లు డీసీపీ అమిత్ గోయల్ తెలిపారు. పోలీసులు సీసీటీవీ ఫూటేజ్‌ను పరిశీలించారు. నిందితుడి అడ్రస్‌లో తనిఖీలు చేశారు. ఆ స్వామీజీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఆగ్రా వద్ద ఆయన ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడ గాలింపు చేపట్టారు.

## సెప్టెంబర్ 30న ఓటీటీ విడుదల




మాజీ మంత్రి, ప్రముఖ వ్యాపారవేత్త గాలి జనార్దన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి నటించిన తొలి చిత్రం 'జూనియర్', థియేటర్లలో సత్తా చూపించకపోయిన ఇప్పుడు ఓటీటీలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ లవ్ అండ్ రొమాంటిక్ డ్రామాలో కిరీటికీ జోడిగా యంగ్ సెన్సేషన్ శ్రీలీల నటించింది. జూలై 18న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయినా, కిరీటి డాన్స్ మూవ్స్, శ్రీలీల గ్లామర్ మాత్రం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యాయి. ఈ సినిమా ఓటీటీలో సెప్టెంబర్ 22 నుండి స్ట్రీమ్ కావాల్సి ఉన్నా, తాత్కాలిక కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ప్రముఖ తెలుగు ఓటీటీ 'ఆహా' తాజాగా కొత్త తేది ప్రకటించింది. 'జూనియర్' సినిమా సెప్టెంబర్ 30న నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఆహా ట్వీట్‌లో.."సీనియర్‌కు సెమిస్టర్ ఎగ్జామ్స్ ఉన్నాయ్ అని జూనియర్ 30కి వస్తున్నాడు!"అంటూ క్రియేటివ్ క్యాప్షన్‌తో సినిమా పోస్టర్‌ను విడుదల చేసింది. దీంతో ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓటీటీ విడుదల ఖరారైంది. ఈ మూవీ కథ విషయానికి వస్తే.. ఇందులో స్టోరీ అంతా కూడా అభి (కిరీటి రెడ్డి) అనే యువకుడి చుట్టూ తిరుగుతుంది. చిన్ననాటి నుంచి తండ్రి చూపించే ఓవర్ ప్రేమను భరించలేని అభి, ఫ్రెండ్స్‌తో తన ఇంజినీరింగ్ లైఫ్‌ను ఎంజాయ్ చేయాలని ఆశిస్తాడు. చదువు పూర్తయ్యాక తండ్రికి దూరంగా ఉండేందుకు ఉద్యోగానికి చేరతాడు, అదే కార్యాలయంలో తన ఫస్ట్ లవ్ స్ఫూర్తి (శ్రీలీల) ను కలుసుకుంటాడు.




## 8 కిలోల బరువు తగ్గిన మాళవిక

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది.అయితే ఓ సినిమా కోసం మాళవిక కేవలం రెండు వారాల్లోనే 8 కిలోల బరువు పెరిగిందట. అంతకు ముందు 14 రోజుల్లోనే బరువు తగ్గింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. తన ఫిట్నెస్ సిక్రెట్ రివీల్ చేసింది. ఒక సినిమాలో తన పాత్ర కోసం కేవలం 14 రోజుల్లోనే 8 కిలోల బరువు తగ్గిందట. అది తనకు చాలా కష్టమైన దశ అని చెప్పుకొచ్చింది.తక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకున్నానని.. అదే సమయంలో శారీరకంగా చాలా కష్టపడి స్టంట్స్, యాక్షన్ సీన్ రిహార్సల్స్ చేయడం శరీరంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి తెలిపింది. శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం, కాబట్టి కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేశానని అది చాలా ప్రమాదకరమైనది అని తెలిపింది.ఆ డైట్ ప్లాన్ శరీరంపై దుష్ప్రభావాలను కలిగిస్తుందని.. శక్తిలేకపోవడంతో చాలాసార్లు బలహీనంగా అనిపించిందని.. డాక్టర్ సైతం ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండాలని చెప్పారని.. తాను ఫాలో అయిన డైట్ మాత్రం అస్సలు పాటించవద్దని తెలిపింది. ప్రస్తుతం మాళవిక చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతున్నాయి.

## హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు

భారీ వర్షాలు కురుస్తున్న వేళ హైడ్రా ప్రజావాణికి నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నాలాలు ఆక్రమణలకు గురై వరద నీరు సాఫీగా సాగక తమ నివాస ప్రాంతాలు నీట మునుగుతున్నాయని పలువురు మంగళవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువులను అనుసంధానం చేస్తూ సాగే నాలాలు కబ్జాలకు గురి అవ్వడంతో పై నుంచి వచ్చిన వరద నేరుగా చెరువుకు వెళ్లకుండా.. కాలనీలను ముంచెత్తుతోందని పలువురు ఫిర్యాదు చేశారు. ఇలా మంగళవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులు వస్తే.. ఇందులో 30కి పైగా నాలా ఆక్రమణలు, వరద ముంపునకు సంబంధించినవి ఉన్నాయి. చెరువుల తూములు మూసేయడంతో పైన ఉన్న కాలనీలు నీట మునుగుతున్నాయని పలువురు ఫిర్యాదులు చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ విలేజ్‌లో బందంకొమ్ము చెరువు నాలాను డైవర్ట్ చేయడం వల్ల వరద సాఫీగా సాగక దాదాపు 8 కాలనీలు వరదతో ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు పెద్దమొత్తంలో వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ పరిశీలించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. కొన్ని చోట్లకు తాను వచ్చి పరిశీలిస్తామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు.
యూసుఫ్‌గూడ వద్ద ఉన్న కృష్ణ నగర్‌లో మురుగు, వరద నీరు ముంచెత్తుతోందని.. ఏమాత్రం వర్షం పడినా ఇంట్లోంచి బయటకు రాలేకపోతున్నామని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. నాలాల్లో పేరుకుపోయిన పూడికను తొలగించిన చోట ప్రవాహం బాగున్నా.. మొత్తం క్లీన్ చేయకపోవడంతో సమస్యతలెత్తుతోందని.. నాలాను విస్తరించాలని అక్కడి నివాసితుల హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ వద్ద ఉన్న మయూరీనగర్‌లో వరద నీరు పోయే నాలాను అబ్బులు అనే వ్యక్తి ఆక్రమించి నిర్మించడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని నివాసితులు ఫిర్యాదు చేశారు. నాలాను ఆక్రమించి కంపౌండ్ వాల్ నిర్మించడంతో నీరు సరిగా వెళ్లకపోవడం, కాలనీలో నీరు నిలిచిపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కూకట్పల్లి మాధవినగర్లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని బయటి వ్యక్తులు వచ్చి కాజేయాలని చూస్తున్నారని.. వేరే దగ్గరి డాక్యుమెంట్‌తో ఇక్కడి స్థలాన్ని కొట్టేయాలనుకుంటున్నారని మాధవినగర్ వెల్ఫేర్ సొసైటీ వాళ్లు హైడ్రాకు పిర్యాదు చేశారు. 6 ఎకరాల మేర ఉన్న ఈ లేఔట్‌లో 500ల కుంటుంబాలు నివసిస్తున్నాయని.. తమకు వినియోగించుకునే అవకాశం కల్పించాలని నివాసితులు కోరారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం తట్టి అన్నారం విలేజ్ మీదుగా చిన్న కాలువ వెళ్తోంది. ఈ నాలాకు అడ్డంగా ప్రహరీ నిర్మించడంతో వరద నీరు నిలిచిపోతోందని.. తమ ఇంజినీరింగ్ కళాశాలకు వచ్చే విద్యార్థులు రాలేని పరిస్థితి ఉందని శ్రేయస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫిర్యాదుచేసింది. దీనిపై స్థానిక మున్సిపల్, ఇరిగేషన్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని అయినా ప్రయోజనం లేదని వాపోయారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం సాహేబ్‌నగర్‌ఖలాన్ పరిసర ప్రాంతాల్లోని కాలనీలు నాగార్జున సాగర్ రోడ్డు పరిసరాల నుంచి వచ్చే వరదతో నీట మునుగుతున్నాయని.. కప్పల చెరువు పూర్తి స్థాయిలో నిండి పైన ఉన్న కాలనీలు కూడా నీట మునుగుతున్నాయని పలువురు వాపోయారు.